# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- రాబోయే 3 సంవత్సరాలలో దేశంలోని ప్రతి జిల్లాలో క్యాన్సర్ డేకేర్ కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.

- కృత్రిమ మేథలో భారత్ సాధిస్తున్న అభివృద్ధిని ప్రపంచం కొనియాడుతుందని “మన్ కీ బాత్” కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- అంతరిక్ష రంగంలో ఇస్రో సాధిస్తున్న పురోగతిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు.

- స్వామి దయానంద సరస్వతి జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఆయనకు నివాళులర్పించారు.

========================

కృత్రిమ మేధ రంగంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ సాంకేతికతను వినియోగించుకొని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రతి నెలా ఆకాశవాణి ద్వారా నిర్వహించే ‘మన్‌కీ బాత్ మనసులోని మాట’ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఇటీవల ఏఐ సదస్సులో పాల్గొనేందుకు పారిస్‌కు వెళ్ళినప్పుడు, కృత్రిమ మేధ రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచం ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఓ ఉపాధ్యాయుడి కృషిని ప్రత్యేకంగా అభినందించిన ప్రధానమంత్రి ఉపాధ్యాయుడు తొడసం కైలాష్ ఏఐ సాధనాలను ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారని అన్నారు.

ఇస్రో 100వ రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేయడం దేశానికే గర్వకారణం అని నరేంద్రమోదీ కొనియాడారు. గత 10 సంవత్సరాల్లో దాదాపు 460 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపామని తెలిపిన ఆయన.. ఈ రంగంలో ఏటా పురోగతి సాధిస్తున్నామన్నారు. చంద్రయాన్ విజయం దేశానికి ఎంతో గర్వకారణం అని తెలిపారు. అంతరిక్ష రంగంపై యువత కూడా ఆసక్తి చూపుతోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల భాగస్వామ్యం పెరగడం అనేది ఇటీవల సాధించిన విజయాల్లో ఒకటని పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికే అంకితం చేస్తామన్నారు. దేశ స్వాతంత్య్ర పోరాటం, రాజ్యాంగం రూపకల్పనలో మహిళలు ముఖ్య పాత్ర పోషించారని కొనియాడారు.

(వాయిస్ 36 సెకన్లు)

ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఆరోజు అందరూ పరిశోధనా ప్రయోగశాలలను, ప్లానిటోరియంలను, అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించాలని కోరారు. ఇది సైన్స్ పట్ల వారిలో ఉత్సుకతను పెంచుతుందని అన్నారు. జాతీయ క్రీడలను ప్రస్తావించిన ప్రధానమంత్రి  ఆరోగ్యవంతమైన, దృఢమైన దేశంగా మారేందుకు  స్థూల కాయం సమస్యను పరిష్కరించాలన్నారు. ఆహారంలో నూనెను అధికంగా వాడటం వల్ల గుండె జబ్బులు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు దారి తీస్తుందన్నారు. దీని పరిష్కారానికి  వ్యాయామం, ఆహారపు అలవాట్లు  అతి ముఖ్యమైనవిగా  ప్రధానమంత్రి పేర్కొన్నారు.

========================

ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి ఆతిశీని ఆమ్ ఆద్మీ పార్టీ  శాసన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈరోజు నిర్వహించిన పార్టీ శాసనసభాపక్ష భేటీలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆమె పేరును ప్రతిపాదించగా.. మిగిలిన వారు మద్దతు పలికారు. దిల్లీలో ప్రతిపక్ష నేతగా ఒక మహిళ ఎన్నికకావడం ఇదే మొదటిసారి.  ఆప్ శాసనసభాపక్ష భేటీకి పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఇటీవల ఎన్నికైన 22 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

విరామం

========================

రాబోయే 3 సంవత్సరాలలో దేశంలోని ప్రతి జిల్లాలో క్యాన్సర్ డేకేర్ కేంద్రాలను ప్రారంభిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. ఈరోజు ప్రధానమంత్రి మధ్యప్రదేశ్‌లోని ఛత్తార్‌పుర్‌లో “భాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ సైన్స్ రీసెర్చి సెంటర్”కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'అందరికీ ఆరోగ్యం' అనేది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, 'సట్ కా సాత్... సట్ కా వికాస్..'పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి అనేక కేటాయింపులు చేశామన్నారు. క్యాన్సర్ మందులను చౌకగా అందిస్తామని, జిల్లా ఆసుపత్రులలో క్యాన్సర్ క్లినిక్‌లను ప్రారంభించనున్నామని ఆయన ప్రకటించారు. ఆయుష్మాన్ యోజన, జన ఔషధి కేంద్రాల వంటి ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానమంత్రి విజ్ఞప్తి చేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

========================

స్వామి దయానంద సరస్వతి జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఆయనకు నివాళులర్పించారు. స్వామి దయానంద్ సరస్వతి చేపట్టిన  విద్య, సామాజిక సంస్కరణ కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయని రాష్ట్రపతి సామాజిక మధ్యమంలో పేర్కొన్నారు. స్వామి దయానంద సరస్వతి దేశ ప్రాచీన వైభవాన్ని తిరిగి స్థాపించాలనే ఆలోచనల నుండి ప్రేరణ పొంది, ప్రతి పౌరుడు ముందుకు సాగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

========================

కుంభమేళాకు వెళ్లి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, భువనేశ్వర్, అసన్‌సోల్, పాట్నాల మీదుగా చర్లపల్లి - ధన్‌పురాల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఫిబ్రవరి 24, 25వ తేదీలలో చర్లపల్లి-ధన్‌పురా, ధన్‌పురా-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నాయని రైల్వే అధికారులు వివరించారు.

=========================

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగ మార్గంలో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా తరలించడానికి భారత సైన్యం సహాయక చర్యలను చేపట్టింది. నిన్న తెలంగాణలోని, నాగర్ కర్నూల్ లోని దోమలపెంట వద్ద శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగ మార్గం పైకప్పులో ఒక భాగం కూలిపోవడంతో సొరంగం లోపల 8 మంది చిక్కుకోగా.. పలువురు బయటపడ్డారు. ప్రాజెక్ట్, సైట్ ఇంజనీర్లతో సహా లోపల చిక్కుకున్న 8 మందిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

=========================

ఇటీవలి ఉష్ణమండల తుఫాను SARA నేపథ్యంలో భారతదేశం హోండురాస్‌కు 26 టన్నుల మానవతా సహాయాన్ని పంపింది. ఈ సరుకులో శస్త్రచికిత్స సామాగ్రి, గ్లూకోమీటర్లు, ఆక్సిమీటర్లు, చేతి తొడుగులు, సిరంజిలు, ఐవీ ద్రవాలు, దుప్పట్లు, స్లీపింగ్ మ్యాట్లు, పరిశుభ్రత కిట్‌లు వంటి వైద్య సామాగ్రి, విపత్తు సహాయ సామగ్రి ఉన్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

=========================

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాలో భాగంగా మేళా ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకూ కోట్లాది మంది త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. గతనెల 13న ప్రారంభమైన మహా కుంభమేళా ఈనెల 26న శివరాత్రితో ముగియనుంది.

కాగా కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో బీహార్ లోని కైమూర్ జిల్లా చిల్బిలి సమీపంలో జరిగిన ప్రమాదంలో మహిళతో సహా ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కుంభమేళా నుండి తిరిగి వస్తున్న స్కార్పియో వాహనం చిల్బిలి జాతీయ రహదారి వద్ద వేగంగా వచ్చి ఆగి ఉన్న కంటైనర్ ట్రక్కును ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

=========================

ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీలో భాగంగా దుబాయ్ వేదికగా భారత్ పాకిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లో పాకిస్తాన్ 242 పరుగుల లక్ష్యాన్ని భారత్ కు నిర్దేశించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ దిగిన భారత్ కడపటి వార్తలు అందేసరికి 26 ఓవర్లకు 2 వికెట్ల నష్టానికి 128 పరుగు చేసింది. భారత బౌలర్లలో కుల్‌దీప్ మూడు వికెట్లు పడగొట్టాడు. హార్దిక్ పాండ్యా రెండు వికెట్లు దక్కించుకున్నారు. హర్షిత్ రాణా, జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అక్షర్ పటేల్ అద్భుత ఫీల్డింగ్ చేసి ఇద్దరిని రనౌట్ చేశాడు.

=========================

=========================